సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 10 । మే । 2024



ఆటపాటలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

గరిష్ఠం/కనిష్ఠం
39.0/29.0

వాతావరణం

వాతావరణం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాయిబాబాకు లలిత సహస్ర పారాయణం



పారాయణంలో సాయిభక్తులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులోగల శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో గురువారం సామూహిక లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సతీశ్‌కుమార్, నాగుల కిషన్‌గౌడ్, మార కైలాసం, తవుటు రాంచంద్రం, ఆలయ కమిటీ సభ్యులు, సత్సంగం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



కలిగోటలో తడిసిన ధాన్యంబస్తాలు

కథలాపూర్/మేడిపల్లి: కథలాపూర్ మండలం కలిగోట, అంబారిపేట, ఇప్పపెల్లి, పోతారంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు కొట్టుకుపోయాయి. ధాన్యంలోకి వరద నీరు చేరకుండా రైతులు కాలువలు తవ్వుకోవాల్సి వచ్చింది. మేడిపల్లి మండలకేంద్రంలో ఈదురుగాలులు బలంగా వీచాయి. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రేకులు ఎగిరిపోయాయి. చెట్లకొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి.

పేదలకు భారంగా నిత్యావసరాల ధరలు



మాట్లాడుతున్న వెన్న సురేశ్

కథలాపూర్: పెరుగుతున్న నిత్యావసరాల ధరలు పేదలకు భారంగా మారాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వతీరుతో ధరలు ఆకాశానికి అంటుతున్నాయని తెలిపారు. ధరలను తగ్గిస్తేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు చెన్నవేని దశరథం, సోమ భూమయ్య, ముత్యాల మురళి, కర్నె భూమయ్య, చిగుర్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

'టెట్'పై విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యం

జగిత్యాల: 'టెట్' వివాదాన్ని పరిష్కరించంలో విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతూ గతనెల 8న వచ్చిన వివరణ లేఖను వెల్లడించకుండా రహస్యంగా ఉంచి ఉపాధ్యాయులందరినీ మానసిక ఆందోళనకు గురిచేయడంతోపాటు, దరఖాస్తు చేయడం ద్వారా రూ.లక్షలు వృథా చేయించారని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసేలోపు ఎన్‌సీటీఈ నుంచి మరికొన్ని అంశాలపై వివరణ తీసుకుని ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలన్నారు. భాష పండితులకు సంబంధించి కోర్టు మధ్యంతర ఉత్తర్వులను అమలు చేస్తూ వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. విద్యా వాలంటీర్లను నియమించి ఖాళీలను భర్తీ చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం తరలింపులో జాప్యంపై రైతుల నిరసన

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధి యోఖీన్‌పూర్ సింగిల్ విండో కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలించటంలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. ఎస్సై కిరణ్ కుమార్ రైతుల వద్దకు చేరుకుని సమస్య అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన బస్తాలను తరలించటం లేదని, వర్షం కురిస్తే తడిచిపోయే ప్రమాదముందని, అధికారులను అడిగితే లారీల కొరత సాకు చూపుతున్నారని తెలిపారు. ఎస్సై ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. లారీలు సర్దుబాటు చేయాలని సూచించారు. ఆర్డీవో సూచనతో పోలీసులు ఇతర గ్రామాలకు వెళ్తున్న మూడు లారీలను కొనుగోలు కేంద్రానికి తరలించటంతో రైతులు శాంతించారు.

గులాబీ దళపతికి నీరాజనం

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం
- రాంనగర్ నుంచి భారీ ర్యాలీ
- తెలంగాణ చౌక్‌లో రోడ్‌షో
- తరలివచ్చిన జనం.. కిక్కిరిసిన కరీం'నగరం'
- కార్నర్ మీటింగ్ సక్సెస్.. బీఆర్‌ఎస్‌లో జోష్





తెలంగాణచౌక్‌లో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్, హాజరైన జనం

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం కరీంనగర్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా జిల్లాకేంద్రంలో జరిగిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేసీఆర్ మొదట ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వలపార్కు మీదుగా రాంనగర్ చౌరస్తాకు భారీ కాన్వాయ్‌తో సరిగ్గా రాత్రి 7.50 నిమిషాలకు చేరుకున్నారు. రాంనగర్ చౌరస్తాలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, చలిమెడ లక్ష్మీనరసింహారావు, సర్దార్ రవీందర్‌సింగ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీమేయర్ చల్లా స్వరూపరాణి-హరిశంకర్‌లు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి తెలంగాణచౌక్ వరకు 40నిమిషాలపాటు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దారిపొడవునా బాణసంచా పేలుస్తూ, ఒగ్గుడోలు కళాకారులు, డప్పు చప్పుళ్లతో, మహిళలు మంగళహారతులతో



సందడి చేస్తున్న పాడి, రసమయి, వినోద్, గంగుల

నీరాజనం పలికారు. 40 నిమిషాలపాటు సాగిన ర్యాలీలో కేసీఆర్ ప్రజలకు బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగుతూ కార్యకర్తల్లో జోష్‌పెంచారు. 8.30 గంటలకు తెలంగాణచౌక్‌కు చేరుకున్న కేసీఆర్ బస్సుపై నుంచి అభివాదం చేస్తూ 10 నిమిషాల పాటు అభివాదం చేస్తూ ఉత్తేజం నింపారు. 25నిమిషాల పాటు చేసిన ప్రసంగంతో



భవనాలపై ఉండి కేసీఆర్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

తెలంగాణచౌక్‌కు తరలివచ్చిన జనం సీఎం కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేసినప్పుడల్లా కేరింతలు, అరుపులతో సభా ప్రాంగణమంతా దద్దరిల్లింది. ప్రసంగం ప్రారంభంలో కరీంనగర్ భీముడు, అభివృద్ధి ప్రదాత గంగుల కమలాకర్ అనడంతో జనం హర్షధ్వానాలు పలికారు. పాడికౌశిక్‌రెడ్డిని హుజురాబాద్ టైగర్ అంటూ కేసీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. స్మార్ట్‌సిటీ తెచ్చిన వినోద్‌కావాలా... నయాపైసా తేని బండి సంజయ్ కావాలో ఆలోచించాలని అనడంతో.. సభ నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. రోడ్‌షోకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ముఖ్యనేతలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో నగరం గులాబీమయంగా మారింది.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలు ఉండగా 7,12,710 మంది ఓటర్లున్నారని, 882 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఇందులో 990 సీసీకెమెరాలు బిగించామన్నారు. అలాగే 36 థిమాటిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఓట్ల పర్వం ఓటే సర్వం అనే నినాదంతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, దివాకర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కళాశాల 12వ వార్షికోత్సవం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలరూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారయణ్ భట్ తెలిపారు. ఈ వేడుకలకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, హైద్రాబాద్ మాజీ డైరెక్టర్ డాక్టర్ విలాస్ ఎ తోనపి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. వీరితో పాటు వ్యవసాయ వర్సిటి డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ జె. సత్యనారాయణతో పాటు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమా పాల్గోనున్నారు.

రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



రాయికల్‌లో మట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

జగిత్యాల: కొనుగోలు కేంద్రాల్లో త్వరితగతిన ధాన్యం కొనేవారు లేక రైతులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నిజామాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సరైన ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఎందుకు ఇవ్వడం లేదని, దీనిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించాలని తెలిపారు. ఎమ్మెల్సీ రమణ నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ధాన్యం వర్షాలకు తడిసినా పట్టించుకునే వారు లేరని పేర్కొన్నారు. గతంలో రైతుల పక్షాన మాట్లాడిన జీవన్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. 40 ఏళ్లలో ఎన్నో పదవులు చేపట్టిన జీవన్‌రెడ్డి ఇవే చివరి ఎన్నికలంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ ప్రధాని మోదీ వేములవాడ అభివృద్ధిపై ఒక్కమాటా మాట్లాడలేదన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్ప ప్రజలకు కన్పించని వ్యక్తి

రాయికల్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాయమాటలు నమ్మి మోసపోవద్దని బాజిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి రాయికల్‌తోపాటు మైతాపూర్, ఇటిక్యాల, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ప్రచారం చేశారు. అర్వింద్‌వి జూటా మాటలని, మోదీ పేరు చెప్పుకుని ఓటు అడుగుతున్నారని, సోషల్ మీడియాలో తప్ప ప్రజలకు కన్పించని వ్యక్తి అని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ మంత్రి రాజేశంగౌడ్ ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోరహన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు.

- ఎన్నికల తర్వాత డబుల్ ఇళ్ల నిర్మాణం
- కార్నర్ మీటింగ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు అభివృద్ధి సాధ్యమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నిజామాబాద్ ప్రజలు జీవన్‌రెడ్డిని ఆశీర్వదిస్తే రాహుల్‌గాంధీ కేబినెట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి అవుతారని తెలిపారు. గురువారం రాత్రి జిల్లాకేంద్రంలోని జంబిగద్దె ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నాలుగు గ్యారంటీలు అమలు చేశామని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత మిగతా గ్యారంటీలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. పేదలకు డబుల్ ఇళ్ల నిర్మాణం, కల్యాణలక్ష్మి రూ.లక్షతోపాటు తులం బంగారం, రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు. సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డి సేవలు రాష్ట్రానికి దేశానికి అవసరమని అలాంటి నాయకుడికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా ప్రజలను కోరారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి శంకర్ పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా కూతురు ప్రచారం

- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి
- ఉపాధి పనుల వద్ద ప్రచారం



మద్దులపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న నందిని

పెగడపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ఆయన కూతురు నందిని ఎన్నికల ప్రచారం చేశారు. మండలంలోని మద్దులపల్లి, బతికపల్లి గ్రామాల్లో ఆమె గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మల్లారెడ్డి, వెంకన్న, సత్యనారాయణరెడ్డి, రఘునందన్, తిరుపతి, వెంకటేశం పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

14 వరకు రూ.100 లేట్ ఫీజుతో అవకాశం

కోరుట్ల: పాలిసెట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈనెల 14వరకు రూ.100 లేట్ ఫీజుతో దరఖాస్తు చేసుకునే అవకాశం బోర్డు కల్పించిందని కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం రాంప్రసాద్ తెలిపారు. గతంలో రూ.100 లేటు ఫీజుతో ఈనెల 7లోపు చెల్లించేందుకు అవకాశం ఇచ్చారని, ప్రస్తుతం గడువు పెంచిందని, రూ.300 ఫీజుతో ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 24న ఎంట్రెన్స్ ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దు

జగిత్యాలరూరల్: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి, హన్మాజీపేట, చెర్లపల్లి గ్రామాల్లో నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను అన్ని రంగాల్లో ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులు ఆరుగాలం పండించిన వరిధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతోనే ప్రభుత్వం దిగివచ్చి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలముకుందం, ఆనందరావు, రజిత, దామోదర్, తిరుపతి, నర్సయ్య, గంగారాం, మహిపాల్ పాల్గొన్నారు.



కండ్లపల్లిలో ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్

గడువు పూర్తయినా టెండర్లకు నో..

- జేఎన్టీయూ విద్యార్థులకు అందని మెనూ
- పాత కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తున్న అధికారులు
- కొత్తగా టెండర్లు పిలవాలంటున్న విద్యార్థులు



జేఎన్టీయూ (నాచుపల్లి)

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని జేఎన్టీయూ (నాచుపల్లి)లో వివిధ టెండర్ల గడువు ముగిసి ఏళ్లు గడుస్తోంది. అయినా అధికారులు కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆసక్తి చూపడం లేదు. కళాశాలకు సరుకులు అందించే బాధ్యతను ఒకే కాంట్రాక్టర్ ఏళ్ల తరబడిగా చేపడుతున్నాడు. దీంతో సదరు వ్యక్తి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా టెండర్లు పిలవాలని యాజమాన్యానికి పలువురు వినతపత్రాలు అందించినా.. అధికారుల్లో మాత్రం స్పందన ఉండడం లేదు.


టెండర్ల గడువు ఇలా...

కళాశాలలో క్యాంటీన్, జనరల్ స్టోర్ నిర్వహణకు 2021తో గడువు ముగిసింది. వీటితోపాటు సెక్యూరిటీ సర్వీసెస్ ఆర్నెల్ల క్రితం, హౌస్‌కీపింగ్ ఐదు నెలల క్రితం, బాలుర, బాలికల హాస్టళ్ల నిర్వహణ ఏడాది క్రితం గడువు ముగిసింది. క్యాంటీన్, జనరల్‌స్టోర్‌కు కొత్తగా టెండర్ పిలిస్తే అప్పుడున్న ధరలతో 10శాతం అధిక ధరకు తీసుకుంటామని వివిధ సంస్థలు కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించాయి. ఆ ప్రకారం అప్పుడున్న ధరలతో పోల్చితే 50శాతం వరకు ధరలు పెరిగేవి. సెక్యూరిటీ సర్వీసెస్, హౌజ్ కీపింగ్, మెస్ నిర్వహణకు టెండర్ ఆహ్వానిస్తే ఇందులో టెండర్‌దారులు తక్కువ ధరకు కోట్ చేస్తే విద్యార్థులపై ఆర్థికభారం తగ్గే అవకాశం ఉండేది.

యూనివర్సిటీ అధికారులు ఏం చేస్తున్నారు?

వాస్తవానికి యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఏడాదికోసారి టెండర్లు నిర్వహించాలి. అలా కాకుండా అటు కళాశాల యాజమాన్యం, ఇటు యూనివర్సిటీ అధికారులు నిబంధనలు తుంగలోతొక్కి.. ఏళ్ల తరబడి క్యాంటీన్, జనరల్ స్టోర్ ఒకే కాంట్రాక్టర్‌ను కొనసాగించడం వెనుక మతలబు ఏమిటో అంతుపట్టకుండా ఉంది. ఇటీవల మెస్‌లో భోజనం సరిగా వండలేదని ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న నాథుడు లేకుండాపోయాడు. ఒకే కాంట్రాక్టర్‌కు ఏళ్లుగా కట్టబెడితే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారని అపవాదు కూడగట్టుకుంటున్నారు. సెక్యూరిటీ సర్వీస్ మాత్రం కళాశాల ప్రారంభం నుంచి ఒకే సంస్థ టెండర్ దక్కించుకుంటోంది. రాష్ట్రంలో చాలా ఏజెన్సీలు ఉన్నా.. ఒక్క ఏజెన్సీ కూడా ఇంతవరకు సెక్యూరిటీ టెండర్‌కు అర్హత సాధించలేదు. అంటే యూనివర్సిటీ అధికారులు పెట్టిన నిబంధనలను వారు సాధించలేకపోతున్నారా..? లేక కావాలనే మిగతావాటిని నిబంధనల పేరుతో పక్కకు పెట్టి, ఒకే సంస్థకు కట్టబెడుతున్నారా..?అని స్థానికంగా చర్చనీయాంశంగా మారుతోంది. ఇటీవల కళాశాల అటానామస్‌గా మారింది. ఈ క్రమంలో టెండర్లను కళాశాల పరిధిలో నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. దీనికి యూనివర్సిటీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వర్సిటీ అధికారులు స్పందించి గడువు ముగిసిన కాంట్రాక్టులకు కొత్తగా టెండర్‌లు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

వైస్ చాన్స్‌లర్ రాగానే ప్రక్రియ



క్యాంటీన్ టెండర్‌పై యూనివర్సిటీకి లేఖరాసి పంపించాం. ప్రస్తుత టెండర్లను యూనివర్సిటీ మూడు నెలల గడువు పెంచింది. ఇప్పుడున్న వైస్‌చాన్స్‌లర్ గడువు ఈనెలతో ముగుస్తుంది. కొత్త వైస్‌చాన్స్‌లర్ రాగానే టెండర్ ప్రక్రియ ఉంటుంది.

– కామాక్షి ప్రసాద్, జేఎన్టీయూ ప్రిన్సిపాల్

క్లుప్తంగా

పోలింగ్‌బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాతో కూర్చోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: ఈ నెల 13న జరగనున్న ఎంపీ ఎన్నికల సందర్భంగా బీఎల్‌వోలు ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాలతో కౌంటర్లలో కూర్చోవాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ చిట్టీల పంపిణీ పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల సిబ్బందికి అన్ని ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. పోలింగ్ రోజున ఉద్యోగులకు ఇబ్బంది కలుగకుండ సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగాధర్, మండల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో మద్యం,డబ్బులు ఎమైనా సరఫరా చేస్తున్నారని ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అరుణ్‌కుమార్, ఏఎస్సై సత్యనారాయణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడితో పనులు



స్వీట్‌షాప్‌లో పనులు చేస్తున్న మైనర్

మేడిపల్లి: మండల కేంద్రంలోని ఓ స్వీట్‌హౌజ్‌లో బాల కార్మికులతో పనులు చేయిస్తున్న పట్టించుకునే నాథుడేలేకుండా పోయారు. మైనర్‌తో చాకిరి చేయిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. మండల వ్యాప్తంగా ఉన్న రాజస్థాన్ హోటళ్లలో కొన్ని చోట్ల బాల కార్మికులు తారసపడుతున్నరు. పిల్లలతో ఎందుకు పనులు చేయిస్తున్నారు అని అడిగితే ఇప్పుడే సరదాగా చేస్తున్నాడు అని చెప్త అప్పటిమట్టుకు ఇంట్లోకి పంపుతున్నారు.

మహిళ ఆత్మహత్య

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ బుధవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. గౌరీ ఆమె భర్త అశోక్ మధ్య మనస్పర్థల కారణంగా జీవితంపై విరక్తితో బుధవారం మధ్యాహ్నం బాత్‌రూం యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి అన్న మెదిగోని నగేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ధర్మపురి: విద్యుత్ స్తంభం ఎర్త్ వైర్ తగిలి మేక అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మంతుర్తి గంగాధర్ అనే రైతుకు చెందిన మేక గురువారం మేత కోసమని బయటకు వెళ్లింది. విద్యుత్ ఎర్తువైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

అరచేతిలో ఎన్నికల సమాచారం

- పటిష్ట నిర్వహణకు పలు యాప్‌లు
- అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల కమిషన్
- ఫిర్యాదుల పరిష్కారంలో వేగం

బుగ్గారం: సార్వత్రిక ఎన్నికల సమరాన్ని సమర్థవంతంగా, పటిష్టంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం పలు అప్లికేషన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ప్రతిఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్‌లు సర్వసాధారణమైన నేపథ్యంలో వీటి ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకొని ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన పొందవచ్చు. తద్వారా ఎన్నికల ప్రక్రియలో పౌరులందరి భాగస్వామ్యం పెంచడం సులభతరం అవుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం పలు యాప్‌లు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటే పలు వెబ్‌పోర్టల్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్

ఓటరు లిస్టులో పేర్లను నమోదు చేసుకోవడానికి, తప్పొప్పులను సవరించుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. తమ పేరు ఓటరు లిస్టులో ఉందో లేదో సరిచూసుకోవడంతోపాటు డిజిటల్ ఫొటో ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి సైతం ఈ యాప్ వినియోగించవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తల అప్‌డేట్స్ కూడా ఇదే యాప్ ద్వారా పొందవచ్చు.

సాక్ష్యం యాప్

వికలాంగులు ఎన్నికల ప్రక్రియలో సులభంగా పాల్గొనేందుకు ఈ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా దివ్యాంగులు వారి పోలింగ్ స్టేషన్‌ను గుర్తించడంతోపాటు వారికి అవసరమైన వీల్‌చైర్ సదుపాయం పొందవచ్చు. ఈ యాప్ దృష్టిలోపం ఉన్నవారికి ఉపయోగపడేలా వాయిస్ ద్వారా సహాయం అందిస్తుంది. అలాగే టెక్స్ టూ స్పీచ్ సదుపాయం కూడా ఉంది.

కేవైసీ యాప్

ఈ యాప్ ద్వారా ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను తెలుసుకోవచ్చు. వారిపై గల క్రిమినల్ కేసులు, వాటి స్థితిగతుల వివరాలు తెలుసుకోవచ్చు. అభ్యర్థుల పేర్లతో వారి వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.





సీ విజల్ యాప్

ఎన్నికలలో అక్రమాలకు పాల్పడే వారి గురించి, ఎన్నికల సందర్భంగా జరిగే పలు అవాంఛనీయ సంఘటనల గురించి ఈ యాప్ ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా అప్లోడ్ చేయవచ్చు. అలాగే పౌరులు తాము చేసిన ఫిర్యాదుల స్థితిగతుల గురించి తెలుసుకోవచ్చు. మొత్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఓటర్ టర్న్‌అవుట్

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం వివరాలను తెలుసుకునేందుకు ఓటర్ టర్న్‌అవుట్ యాప్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. అధికారులు పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో పొందుపరుస్తారు. దీంతో ఓటింగ్ సరళిపై పూర్తి సమాచారాన్ని దీని ద్వారా పొందవచ్చు.

అబ్జర్వర్ యాప్

ఎన్నికల సందర్భంగా నమోదైన అక్రమాలు, కోడ్ దుర్వినియోగంపై నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఇది ఎన్నికల పరిశీలకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్

ఈ యాప్ ద్వారా ఓటరు తమ మొబైల్ నంబరు సహాయంతో పోర్టల్‌లో తమ ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. అలాగే ఈ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు సైతం చేయవచ్చు. పోలింగ్ బూత్‌లో సమస్యలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో సమస్యలు, ఎన్నికల ఖర్చు,అక్రమాల వంటి ఫిర్యాదులను ఈ యాప్ ద్వారా చేయవచ్చు. అంతేకాకుండా తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా పౌరులు చెక్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన అనేక రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఈ అప్లికేషన్ ఎంతగానో తోడ్పడుతుంది.

ఈ అప్లికేషన్‌లు మాత్రమే కాకుండా ఎన్నికల సంఘం పలు వెబ్‌పోర్టల్‌లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటర్ పోర్టల్, స్వీప్ వంటి వెబ్‌సైట్‌ల ద్వారా సైతం ఓటర్లు పలు రకాల సేవలు, సమాచారాన్ని పొందవచ్చు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు ఈసీఐ నూతన టెక్నాలజీని వినియోగించుకోవడంతో పౌరులకు ఎన్నికల ప్రక్రియను గురించి అవగాహన చేసుకోవడం, అందులో భాగస్వాములు కావడం ఎంతో సులభమైంది.

ఘనంగా 16వ పండుగ వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లిలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులపాటు ఏప్రిల్ నెల 24న జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకను పురస్కరించుకుని గురువారం 16వ పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త చింతపండు తిరుపతిరెడ్డి శశికళ దంపతులు, ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అర్చకులు నాగుల మల్యాల వీరాచారి, అయ్యోరి నరసయ్య, అనిల్ మంత్రోచ్ఛా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి సాగర్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ అశోక్ అన్నారు. మండలంలోని మొగిలిపేటలో గురువారం కెనరాబ్యాంక్‌లో వీవోఏసీఏలతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల్లో అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రూ.399, రూ.299 బీమా పాలసీలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అనంతరం కొత్తదాం రాజుపల్లికి చెందిన దప్పుల గంగు అనారోగ్యంతో మృత చెందగా, ఆమెకు మంజూరైన బీమా నగదు రూ.2 లక్షలను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రిజర్వుబ్యాంక్ వీబీడీఎస్ కో–ఆర్డినేటర్ నిగ రాజేశ్, రాకేశ్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో పెద్దపల్లి గొంతుకనవుతా



- ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ
- ఒకే ఫ్యామిలీకి మూడు అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయమా?
- హామీలు నెరవేర్చకుండా ఓట్లు అడిగే నైతికహక్కు కాంగ్రెస్‌కు లేదు
- కాంగ్రెస్, బీజేపీలే సింగరేణిని ముంచినాయి
- 'సాక్షి'తో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లిలో ఎగిరేది గులాబీ జెండానేనని, ఇది కేసీఆర్ చెప్పినట్లుగా ఆగర్భ శ్రీముంతుడికి, భూగర్భ కార్మికుడికి మధ్య పోటీయేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజా సమస్యల కోసం కేంద్రం మెడలు వంచగలిగే శక్తి కేవలం బీఆర్ఎస్‌కే ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే ఈసారి పెద్దపల్లి నుంచి తన గెలుపు ఖాయమని, ప్రజల గొంతును పార్లమెంటులో వినిపిస్తానని తెలిపారు. సామాజిక న్యాయాన్ని తొంగులో తొక్కినా కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. – సాక్షి, పెద్దపల్లి

మీ ప్రచారం ఎలా సాగుతుంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది?

అమలు కాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అనతి కాలంలోనే పరిపాలనలో అట్టర్ ప్లాప్ అయ్యింది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది. ఏ ఒక్క హామీ సక్కగా అమలు చేయడం లేదు. ప్రజలు తొందరపాటుతో ఓటేశామని తమ భాదలు చెప్పుకుంటున్నారు. మళ్లీ సారే రావాలి కావాలి అంటూ తమ బిడ్డగా స్వాగతిస్తున్నారు. హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ గెలవాలి. ఎంపీగా గెలిస్తే ప్రజా గొంతుకవుతా. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పథకాలను అమలు చేయిస్తా.

మీపై వస్తున్న విమర్శలపై స్పందన ఏంటి?

మచ్చలేని నాయకుడిని, నన్ను విమర్శించడానికి, వారికి చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి పనులు ఏం లేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల బాగు కోసం అభివృద్ధికి పాటు పడే వారు కావాలా? తాగు, సాగు నీరు అందించక రైతుల ఆత్మహత్యలు చేసుకునేలా చేసిన పార్టీ కావాలా? ఒక్క కుటుంబంలోనే ముగ్గురికి పదవులు కావాలో విజ్ఞులైన ప్రజలే ఆలోచించాలి. 40 ఏళ్లుగా వారి కుటుంబమే ఈ పెద్దపల్లిని పరిపాలించాలా? తాత, తండ్రి, మనువడు అంటూ ప్రజల మీద రుద్దుతున్నారు. దేశంలో శ్రీమంతుల జాబితాలో 9వ నంబర్‌గా ఉన్న వారు రిజర్వ్‌డ్ స్థానంలో పోటీచేయడం ఎందుకు? ఇదెక్కడి సామాజికన్యాయమో ఆలోచించాలి.

ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

సింగరేణి కార్మికుడిగా నాకు కార్మికుల సమస్యలు తెలుసు. సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కొత్తగనుల ఏర్పాటు, ఆదాయపన్ను మినహాయింపు, పెన్షన్ విధానం, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లిలో పలు సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదల, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషిచేస్తా. సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు నిర్మాణం, ఓదెల, రామగిరిఖిల్లా, ధర్మపురి, కాళేశ్వరం, రామునిగుండాలతో పాటు పలు ప్రాంతాలను టూరిజం హబ్‌గా మార్చేలా నా దగ్గర ప్రణాళికలున్నాయి.

బీఆర్ఎస్ ఎంపీలను ఎందుకు గెలిపించాలి?

మా నాయకుడు కేసీఆర్ చెప్పినట్లుగా కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. బలమైన బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే తెలంగాణ హక్కుల కోసం బరిగీసి కొట్లాడుతాం. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో సైతం రాజకీయ సంక్షోభం వచ్చే అవకాశం ఉంది. అందుకే బీజేపీతో రేవంత్‌రెడ్డి అంటకాగుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఒక్కరికి ఒక్కరు సహకరించుకుంటున్నారు.

మీ ప్రత్యర్థి పార్టీలపై మీ స్పందన ఏంటి?

పదేళ్లలో కేంద్రంలో బీజేపీ చేసిందేమీ లేదు. కనీసం చెప్పుకోవడానికి ఫలానా పని అంటూ కనిపించడం లేదు. 2019లో పుల్వామా దాడిని ఉపయోగించుకున్నారు. ఇప్పుడు రామమందిరం పేరుతో రాజకీయం చేస్తున్నారు. మాకు అన్ని మతాలు సమానమే. రెచ్చగొట్టి రాజకీయాలు మేం చేయం. తెలంగాణపై బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపెట్టింది. సింగరేణిని ప్రైవేట్‌పరం చేయవద్దని చెప్పిన, నోటిఫికేషన్ ఇచ్చి ప్రైవేట్‌పరం చేశారు.

చివరగా నియోజకవర్గ ఓటర్లకు మీరు ఏం చెప్పదల్చుకున్నారు?

ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా.. ఇక్కడే చస్తా.. ఈ గోదావరి తల్లిగా ప్రమాణం చేసి చెప్పుతున్నా. ఒక్కసారి ఎంపీగా గెలిపిస్తే సింగరేణి కార్మికుల సమస్యలు, నియోజవకవర్గ పరిధిలోని రైల్వే సమస్యల పరిష్కారం కోసం, ఇక్కడి ప్రజల వాణిని ఢిల్లీలోని పార్లమెంట్‌లో వినిపిస్తా. అదే స్థానికంగా ఉండని, ఏసీల్లో తిరిగే వ్యాపారవేత్తలైన వారికి ఓటు వేస్తే మురుగుకాలువలో వేసినట్లే అవుతుంది. ప్రజలు ఆలోచించి నన్ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నా.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



సిరిపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్: పేదల పార్టీ కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వారు వేర్వేరుగా ఉపాధి కూలీలను కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కులగణన కాంగ్రెస్ బాధ్యత

కోరుట్ల: కులగణనతో బీసీలకు పూర్తి న్యాయం చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీసీలకు పూర్తి స్థాయిలో రిజర్వేషన్లు అమలు కావడానికి సీఎం రేవంత్‌రెడి చర్యలు చేపట్టారన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, పద్మశాలీ సంఘం నాయకులు వాసం భూమానందం, జక్కుల ప్రసాద్, ఆడెపు మధు, దాసరి రాజశేఖర్, కౌన్సిలర్లు ఆడెపు కమల, నాగబూషణం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్థాయి మరిచి మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాలటౌన్: ఎంపీ అర్వింద్ జీవన్‌రెడ్డిపై స్థాయిని మార్చి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి గురువారం మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మోదీ ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల తర్వాత కేసీఆర్ దుకాణం బంద్ అవుతుందని తెలిపారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మహిళాకాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించి జీవన్‌రెడ్డికి ఓటేయండి

కోరుట్లరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి నిజామాబాద్ ఎంపీగా తాటిపర్తి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్తిని అనిల్ అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో గురువారం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

జీవన్ రెడ్డికి మద్దతుగా న్యాయవాదుల ర్యాలీ

జగిత్యాలజోన్: నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జీవన్ రెడ్డి గెలిస్తే జగిత్యాల ప్రాంతంలో జరిగే అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ బెత్తపు లక్ష్మణ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి అంటేనే అభివృద్ధి

రాయికల్: నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అంటేనే అభివృద్ధి అని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలో మాట్లాడారు. జీవన్‌రెడ్డి జగిత్యాల జిల్లాలో ఎంతో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. బోగ శ్రావణి అత్యుత్సాహమే అరవింద్ కొంప ముంచుతుందని, ఆమె పట్ల కార్యకర్తలంతా అసంతృప్తితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనురాధ, మహిళ పట్టణఅధ్యక్షురాలు మమత,నాయకులు పాల్గొన్నారు.

స్థానికుడిని బలపరచండి

సారంగాపూర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి స్థానికుడని, ప్రజలు ఆయనకే ఓటేయాలని కోరుతూ గురువారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలు చేయడంతో పాటు, ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్లు పొల్సాని నవీన్‌రావు, గుడిసె జితేందర్ పాల్గొన్నారు.

బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దు



ప్రచారం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

మేడిపల్లి: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తొంబారావుపేట,పోరుమల్ల, గుడ్లపల్లి,కట్లకుంట, కొండాపూర్, విలయాతబద్, కాచారం, రంగాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజేందర్ రావుని గెలిపిస్తే జోడెడ్లలాగా కలిసి పని చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, బద్దం రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో సమావేశం

మల్యాల: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేంద్ర రావుకు మద్దతుగా గురువారం మల్యాలలో ఉపాధి హామీ కూలీలతో కాంగ్రెస్ నాయకులు సమావేశం అయ్యారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శోభారాణి, విజయానంద్, ఇమామ్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని గురువారం కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు మేలు



బతికెపల్లిలో ప్రభుత్వ విప్ ప్రచారం

పెగడపల్లి/గొల్లపల్లి: కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బతికపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు. గొల్లపల్లిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీని గెలిపించాలని కోరారు.

ధర్మపురిలో కాంగ్రెస్ బైక్‌ర్యాలీ

ధర్మపురి: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కమార్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి వంశీ భారీ ర్యాలీ నిర్వహించారు. రాయపట్నం నుంచి ధర్మపురి పట్టణంలో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు, సింహరాజు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సమీయొద్దీన్

ఇబ్రహీంపట్నం: అసంక్రమిత వ్యాధుల నివారణపై ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సమీయొద్దీన్ ఏఎస్ఎంలకు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 30 ఏళ్ల వయస్సు కలిగిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్నవారిని గుర్తించి వారికి ఎప్పటికప్పుడు సరైన చికిత్స అందెలాగా చూడాలన్నారు. సర్వేకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నవారిని గుర్తించి, వారికి సలహాలు, సూచనలు ఇచ్చి సరైన చికిత్స అందెటట్లు చూడాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అన్విత్‌రెడ్డి, హరీశ్‌కుమార్, సీఎచ్‌వో విజయభాస్కర్, ఎన్‌సీఈ కో ఆర్డినేటర్ మురళి, నర్సింగ్ ఆఫీసర్ రాజేందర్, మౌనిక, ఫార్మసిస్ట్ ఉదయ్‌ప్రసాద్, సీహెచ్ఎస్ హేమలత, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.